ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
ఆదివారం 18 ఆగస్టు 2024



భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 34.0 కనిష్ఠం : 27.0
తణుకు : 34.0 - 26.0

తీరానికి ముప్పు



నరసాపురంలో కోతకు గురవుతున్న ప్రాంతం

- పెరుగుతున్న గోదావరి, సముద్ర నీటి మట్టాలు
- తీరంలో భూమి కంటే దాదాపు మీటరు ఎత్తులో నీటి ప్రవాహాలు
- డ్రెయినేజీల్లో నీరు వెళ్లక ముంపులో చేలు
- ఏటా పెరుగుతున్న క్రాప్ హాలిడే విస్తీర్ణం



సముద్రపు అలలకు చినలంక గ్రామం కొట్టుకుపోగా గ్రామంలో మిగిలిన తుఫాన్ షెల్టర్ శిథిలం

నరసాపురం, ఆగస్టు 17: నరసాపురం తీరంలో చినలంక అన్నది ఒక పంచాయతీ. 20 ఏళ్ళ క్రితం ఈ గ్రామం సముద్ర గర్భంలో కలిసిపోయింది. ప్రస్తుతం తుఫాన్ భవనం మాత్రమే ఆనాటి గుర్తుగా మిగిలింది. ఈగ్రామస్థులంతా వేములదీవి శివారున నివాసం ఉంటున్నారు. ఇదే క్రమంలో పీఎంలంక గ్రామం కూడా సముద్ర ఒడ్డుకు అరకిలోమీటర్ దూరంలో మిగిలింది. ఒకప్పుడు ఈ గ్రామం 3కిలోమీటర్ల దూరంలో ఉండేది. రోజు రోజుకు సముద్రం ముందుకు వస్తుండటంతో తమ గ్రామం కూడా ఏదో ఒక రోజు చినలంక గ్రామంగా సముద్రగర్భంలో కలిసిపోతుందని పీఎంలంక గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై అనేక మంది నిపుణులు పరిశోధనలు చేశారు. అడ్డుకట్ట వేసేందుకు అనేక సూచనలు చేశారు. అయితే నేటికి కార్యరూపం దాల్చలేదు. ఇలా సముద్రం ముందుకు చొచ్చుకురావడంపై అనేక వాదనలు వినిపిస్తున్నాయి.

సముద్రంలో నీటి మట్టాలు పెరగడం ఒక కారణమైతే.. ఇసుక మేటలు పెరిగిపోవడం మరో కారణంగా తేల్చారు. ఈ భయం వీడకుండానే పరిసర ప్రాంత ప్రజల్ని గత ఐదేళ్ళ నుంచి మరో భయం వెంటాడుతున్నది. అదే మురికికాల్వల్లో నీరు బయటకు వెళ్ళకపోవడం. కొద్దిపాటి వర్షానికే డ్రెయినేజీలు మునిగిపోతున్నాయి. గతంలో మాదిరిగా నీరు స్లూయిస్‌ల ద్వారా బయటకు వెళ్ళడం లేదు. ఈకారణంగా వేలాది ఎకరాలు ముంపుబారిన పడుతున్నాయి. ఎక్కువగా సార్వా సీజన్‌లోనే ఈ పరిస్థితి తలెత్తుతున్నది. దీంతో వేసిన నారుమడులు మునిగిపోతుండటంతో రైతులు సాగు చేసేందుకు భయపడుతున్నారు. స్వచ్ఛందంగా క్రాప్ హాలిడే ప్రకటిస్తున్నారు. ఇలా 1000 ఎకరాల నుంచి మొదలైన క్రాప్ హాలిడే నేడు నరసాపురం, మొగల్తూరు మండలాల్లో 3వేల ఎకరాలకు చేరింది. ఇది రానున్న రోజుల్లో మరింత పెరిగే ప్రమాదం పొంచి ఉందని నీటిపారుదలశాఖ నిపుణులు అంచనా వేస్తున్నారు. దీనికి కారణం రోజుకు రోజుకు గోదావరి, సముద్ర నీటి మట్టాలు భూమి కంటే ఎత్తుకు పెరుగుతుండటమే. ఈకారణంగా మురుగునీరు బయటకు వెళ్ళలేక ఎక్కడిక్కడ డ్రెయినేజీల్లో నిలిచిపోతున్నది. రానున్న రోజుల్లో ఈసమస్య మరింత జటిలం అయ్యే ప్రమాదం ఉందని ఇరిగేషన్ అధికారులు గుర్తించారు.

సముద్ర తీర గ్రామాల్లోనే సమస్య..

నేటికి జిల్లాలో ఇరిగేషన్ విధానమంతా బ్రిటిష్ హయాం నాటిదే. కాటన్‌దొర రూపొందించిన డిజైన్ల ప్రకారమే పంట కాల్వలు, మురుగుకాల్వలు ఉన్నాయి. అప్పటి సముద్ర నీటి మట్టాలను పరిగణ లోకి తీసుకుని వీటి నిర్మాణాలు జరిగాయి. అప్పట్లో సముద్రం కంటే భూమి ఎత్తులో ఉండటంతో మురుగు డ్రెయినేజీల నీరంతా సులభంగా బయటకు వెళ్లిపోయేది. నరసాపురం మండలంలోని దర్భరేవు, ఈస్ట్‌కొక్కిలేరు స్లూయిస్‌ల ద్వారా పోటు పాటు సమయంలో మురుగునీరంతా సముద్రంలోకి వెళ్లిపోయేది. అప్పటి డిజైన్ ప్రకారం పాటు సమయంలో భూమిపై నీటి మట్టం మైనస్ 0.6 ఉండేది. పోటు సమయంలో ఈ నీటి మట్టం ప్లస్ 12 ఉండేది. అయితే నేడు పాటు సమయంలో నీటి మట్టం మైనస్ 0.6 నుంచి ప్లస్ 0.5కి పెరిగింది. అంటే ఒక మీటర్ ఎత్తు పెరిగింది. అదే పోటు సమయంలో నీటి మట్టం ప్లస్ 1.2 నుంచి ప్లస్ 1.8కి పెరిగింది. ఇలా నీటి మట్టాలు పెరిగి పోతుండటంతో మురుగునీరు అంతా గోదావరి, సముద్రంలోకి వెళ్ళకుండా డ్రెయినేజీల్లోనే ఉండిపోతున్నది. వర్షాకాలంలో ఈ సమస్య మరింత జటిలంగా కనిపిస్తున్నది. పంట చేలుల్లో నీరు చేరితే వారాల తరబడి నిల్వ ఉండిపోతున్నది. డ్రెయినేజీల్లో నీరు బయటకు వెళ్ళకపోవడమే దీనికి ప్రధానకారణం.

నిపుణుల కమిటీ అధ్యయనం

మూడేళ్ళ క్రితం ఈ సమస్యను ఇరిగేషన్ అధికారులు గుర్తించారు. స్లూయిస్‌ల్లో నీరు బయటకు వెళ్ళకపోవడం, డ్రెయినేజీల్లో నీరు భూమి కంటే ఎక్కువ ఎత్తులో ఉండటాన్ని గుర్తించి ఇరిగేషన్ అధికారులకు ఏటిగట్టుశాఖల అధికారులు నివేదిక ఇచ్చారు. దీన్ని సీరియస్‌గా పరిగణించి మూడేళ్ళ క్రితం ఇరిగేషన్ శాఖలోని డిజైన్స్ చీఫ్ ఇంజనీర్ బృందం నరసాపురం తీరాన్ని సందర్శించింది. దర్భరేవు, కుక్కులేరు స్లూయిస్‌లతో పాటు డ్రెయినేజీలను పరిశీలించింది. పోటు పాటు సమయంలో నీటి మట్టాలు ఎలా పెరుగుతున్నా యన్న విషయాన్ని అధ్యయనం చేసింది. అయితే దీనికి ఎలా అడ్డుకట్ట వేయాలన్నది అంతుచిక్కడం లేదు. దీనిపై అధికారులెవ్వరూ నోరు మెదపడం లేదు. నీటి మట్టం కంటే భూమి మట్టం పెరిగినప్పుడే ఈ సమస్యకు చెక్ పడుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

ఉపాధ్యాయ ఓటర్ల జాబితా సిద్ధం చెయ్యాలి


భీమవరం టౌన్, ఆగస్టు 17 : తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటర్ల జాబితాను పకడ్బందీగా తయారు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ డీఆర్వో ఛాంబర్‌లో విద్యాశాఖ, అన్ని పాఠశాలల సంఘాలతో సమావేశం నిర్వహించి తూర్పు-పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గాల ఓటర్ల జాబిత తయారీకి సంబంధించిన షెడ్యూల్‌పై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూర్పు-పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించిన ఓటర్ల జాబితా షెడ్యూల్ ప్రకారం ఫారం-18 లేదా 19లో దర ఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ వచ్చేనెల 3వ తేదీ వరకు గడువుగా ఉందన్నారు. ఎలక్టోరల్ రోల్స్ ముసాయిదా ప్రచురణ వచ్చేనెల 24న అని, క్లెయిమ్‌లు, అభ్యంతరాలకు గడువు వచ్చేనెల 24 నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు నిర్ణయించడం జరిగిందన్నారు. ఓటర్ల జాబితా సవరణ అనంతరం జాబితాలు నవంబర్ 1న తాజాగా సిద్ధం చేయాలని, తుది జాబితా నవంబర్ 6న ప్రకటించడం జరుగుతుంద న్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలల అధ్యాపకులు ఓటు నమోదుకు అర్హులన్నారు. నిర్ణీత ఫారంలో ఓటు నమోదుకు పూరించిన అనంతరం ఆధార్, సర్వీస్ సర్టిఫికెట్, డీడీవో ధ్రువీకరణ సంతకం, తదితర చేరికలతో దరఖాస్తును సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఉపాధ్యాయుల నియోజకవర్గంలో సాధారణ నివాసి అయి ఉండాలని, అర్హత తేదీకి ముందు ఆరు సంవత్సరాలలోపు, కనీసం మూడు సంవత్సరాల పాటు, ఏదైనా విద్యాసంస్థలో బోధనలో నిమగ్నమై ఉండాలన్నారు. ఒక వ్యక్తి గత ఆరు సంవత్సరాలలో కనీసం మూడు సంవత్సరాల పాటు నిర్దేశిత విద్యాసంస్థల్లో బోధించడంలో ఉండాలని, అది నిరంతర స్పెల్‌లో గాని, విడివిడిగా స్పెల్‌లలో గాని ఉండవచ్చు అన్నారు. పార్టు టైం ఉపాధ్యాయులు దరఖాస్తుకు అనర్హులు అన్నారు.

పోలీసుల అదుపులో బిహారీలు

భీమవరం క్రైం, ఆగస్టు 17: భీమవరం రెండవ పట్టణంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఆరుగురు బిహారీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని ప్రశ్నించగా బంగారం మెరుగుపెట్టడానికి ఈ ప్రాంతానికి వచ్చామని పొంతనలేని సమాధానం చెప్పారు. వారిని విచారిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఊరూ వాడా
బదిలీలు
పచ్చ జెండా ఊపిన ప్రభుత్వం

దేశం గర్వించే రీతిలో విద్యార్థులు ఎదగాలి
ఐఐటీ అల్యుమ్ని కౌన్సిల్ ప్రెసిడెంట్ డాక్టర్ రవిశర్మ



7

మట్టినీ వదలని
వైసీపీ నేతలు

పొలాలను తవ్వుకుంటాం. మెరకలను తొలగిస్తాం. చెరువులు తవ్వుకుంటాం. మట్టిని వెంచర్‌లలో పూడ్చుకుంటాం. అనుమతులు లేకపోయినా ఫర్వాలేదు. నేతల ఆశీస్సులు ఉంటే చాలు అనుకునే మట్టి మాఫియాకు అడ్డుకట్ట పడనుంది. వెంచర్‌లలో మట్టిని పూడ్చుకునే అనుమతులకు కూటమి ప్రభుత్వం బ్రేక్ వేసింది. మైనింగ్ శాఖకు ఆ దిశగా ఆదేశాలు జారీచేసింది. వైసీపీ హయాంలో సాగిన దందాను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం ఇటువంటి నిర్ణయం తీసుకుంది. కొత్త మార్గదర్శకాలు వచ్చిన తర్వాతే మైనింగ్ శాఖ అనుమతులు మంజూరు చేయనుంది. గతంలో జరిగిన దందాపైనా కూటమి ప్రభుత్వం కన్నేసినట్టు సమాచారం.



- రూ. కోట్లలో దోచుకున్న నాయకులు
- జిల్లాలో రూ.45 కోట్లు వసూలు చేయాలంటూ గత ప్రభుత్వం ఆదేశాలు
- మైనింగ్ శాఖకు బాధ్యతల అప్పగింత
- అధికారుల వ్యూహాత్మక మౌనం
- మాజీ ప్రజా ప్రతినిధులవే పెద్ద వెంచర్‌లు

భీమవరంలో మాజీ ప్రజాప్రతినిధి కనుసన్నల్లో వెలిసిన అనధికార వెంచర్

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వంలో మట్టి దందాకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. నేతల కనుసన్నల్లో మట్టి మాఫియా కోట్ల రూపాయలు దోచుకున్నది. ఐదేళ్లపాటు జిల్లాలో ఇటువంటి అక్రమ రవాణాకు అడ్డూ అదుపూలేకుండా పోయింది. వైసీపీ హయాంలో జరిగిన అక్రమాలను తేల్చేందుకు కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా వెలుగులోకి తెస్తోంది. జిల్లాలోనూ జరిగిన దందాపై దృష్టి సారించింది. ఇప్పటికే తణుకు, తాడేపల్లిగూడెంలో జరిగిన టీడీఆర్ కుంభకోణంపై రాష్ట్ర స్థాయి విచారణ చేపట్టనుంది. సీబీసీఐడీ రంగంలోకి దిగనుంది. మరోవైపు జగనన్న ఇళ్ల పేరుతో సాగిన దందాపైనా కూటమి ప్రభుత్వం దర్యాప్తుకు సిద్ధమవుతోంది. ఇప్పుడు కూటమి నేతల దృష్టి గత ఐదేళ్లలో వైసీపీ నేతల మట్టి, ఇసుక దందాలపైనా దృష్టి సారించారు. అప్పట్లో సొంత వెంచర్‌లకు వైసీపీ నేతలు మట్టిని తరలించారు.

భీమవరంలో మాజీదే పెద్ద వెంచర్

భీమవరం నియోజకవర్గంలో మాజీ ప్రజాప్రతినిధి తన హయాంలో సొంత వెంచర్ కోసం మట్టిని అక్రమంగా తరలించేందుకు ప్రోత్సహించారు. సదరు నేత పేరుతో వైసీపీకి చెందిన నేతలు భీమవరం, వీరవాసరం మండలంలో కోట్లాది రూపాయల విలువైన మట్టిని తరలించారు. భీమవరంలో 84 ఎకరాల పేదల ఇళ్ల లేఅవుట్‌ను వైసీపీ ప్రభుత్వం పూడ్చలేకపోయింది. అధికారులకు నాడు మట్టి లభ్యం కాలేదు. అదే మాజీప్రజాప్రతినిధి వెంచర్‌తోపాటు, దాని చుట్టుపక్కలా దాదాపు 70 ఎకరాలకు మాత్రం మట్టి లభ్యమైంది. అక్రమంగా తరలించి వెంచర్‌ను పూడ్చారు. దానికోసం ప్రభుత్వానికి పైసా పన్నుకూడా చెల్లించలేదు. మట్టిని తరలించేటప్పుడు అధికారులు అడ్డు తగిలితే వైసీపీ హయాంలో ప్రజాప్రతినిధి పేరును అక్రమార్కులు వినియోగించుకున్నారు. అయితే ముందుగా మట్టిని మాజీ ప్రజాప్రతినిధి వెంచర్‌కు తరలిస్తేనే ఇతర ప్రాంతాలకు రవాణా చేసే అవకాశం కల్పించేవారు. దీనివల్ల ప్రభుత్వానికి ప్రయోజనం చేకూరలేదు. పేదల ఇళ్లకోసం సేకరించిన 84 ఎకరాల స్థలాన్ని కూడా వదిలేశారు. ఇప్పటికే పేదల ఇళ్ల స్థలం నిర్మాణానికి నోచుకోలేదు. వర్షాకాలంలో స్థలం చెరువుమాదిరిగా తయారైపోయింది. జిల్లా వ్యాప్తంగా అన్ని పట్టణాల్లోనూ వైసీపీ నేతలు ఇటువంటి దందా చేయడంలో ఆరితేరిపోయారు.

ఆదేశాలు బుట్టదాఖలు

వెంచర్ పూడికలో మైనింగ్ శాఖకు పన్నుకూడా చెల్లించలేదు. జిల్లా వ్యాప్తంగా వెంచర్‌లపై వైసీపీ ప్రభుత్వంలోనే పన్ను వసూలు చేయాలంటూ మైనింగ్ శాఖకు ఆదేశాలిచ్చారు. అందుకు అనుగుణంగా మైనింగ్ విభాగంలోని విజిలెన్స్ శాఖ తొలుత జిల్లాలోని వెంచర్‌లను గుర్తించింది. జరిమానాతో సహా వెంచర్‌లపై పన్ను వసూలు చేయాలంటూ గత ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. జిల్లా వ్యాప్తంగా రూ. 45 కోట్లు వసూలు చేయాలంటూ లక్ష్యాన్ని నిర్దేశించింది. భూవినియోగ మార్పిడిపైనా రుసుము వసూలు చేయాలని ఉత్తర్వులు జారీచేసి హడావుడి చేశారు. వినియోగమార్పిడి పన్నును కూడా మూడు శాతం నుంచి 5శాతానికి పెంచారు. అనుమతి లేకుండా వ్యవసాయ భూములను పూడ్చితే రెట్టింపు పన్ను వసూలు చేయాలని దిశానిర్దేశం చేశారు. రెవిన్యూశాఖ కూడా ఇటువంటి వెంచర్‌లపై కన్నేసింది. గ్రామస్థాయిలో వీఆర్‌వోల ద్వారా వెంచర్‌లను గుర్తించారు. తీరా అమలులోకి వచ్చేసరికి తుస్సుమనిపించారు. వైసీపీ నేతల ఒత్తిళ్లతో అధికారులు వెనక్కుతగ్గారు. పన్ను వసూలు చేస్తే ముందుగా వైసీపీ నేతలనుంచి వసూలు చేయాల్సి ఉంటుంది. దాంతో అధికారులు చేతులెత్తేశారు.

కొత్త మార్గదర్శకాలు రావాల్సిందే..

తాజాగా పెనాల్టీలు చెల్లించి అనుమతులు తీసుకుందామన్నా కుదరదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అనుమతులను నిలిపివేశారు. కొత్త మార్గదర్శకాలు వచ్చేంత వరకు అనుమతులు ఇవ్వకూడదంటూ మైనింగ్ అధికారులు ఆదేశాలిచ్చారు. దాంతో పెనాల్టీలు చెల్లించి అయినా సరే వెంచర్‌లకు అనుమతి తెచ్చుకోవడం కుదరడం లేదు. కొత్త వెంచర్‌లలోనూ మట్టి పూడికకు అనుమతి తెచ్చుకోవాలన్నాసరే కొత్త మార్గదర్శకాలకోసం వేచి చూడాల్సిందే. అప్పటిదాకా జిల్లాలో మైనింగ్ అధికారులు కేవలం ప్రేక్షక పాత్ర మాత్రమే పోషించనున్నారు.



తాడేపల్లిగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

ఆసుపత్రుల బంద్

కోల్‌కతా మెడికోపై హత్యాచారానికి వైద్యుల నిరసన

జిల్లా అంతటా స్తంభించిన వైద్యం



భీమవరంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద వైద్యుల నిరసన

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 17: కోల్‌కతా ప్రభుత్వ ఆసుపత్రిలో ట్రైనీ వైద్యురాలిపై హత్యాచార ఘటనను నిరసిస్తూ పశ్చిమగోదావరి జిల్లా అంతటా శనివారం వైద్యసేవలు స్థంభించాయి. అలిండియా మెడికల్ అసోసియేషన్ పిలుపుమేరకు ప్రైవేటు ఆసుపత్రుల బంద్ నేపథ్యంలో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యులు సంఘీభావం ప్రకటించారు. మధ్యాహ్నం వరకు కూడా అనేక ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఓపీ సేవలు అందించలేదు. ఎమర్జెన్సీ మినహా ఇతర వైద్యసేవలు 24 గంటలు బంద్ ప్రకటించిన నేపథ్యంలో రోగులు ఆర్‌ఎంపీలను ఆశ్రయించాల్సి వచ్చింది. ఇటు ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది తమకు ఆసుపత్రుల వద్ద తగినంత భద్రత కావాలంటూ నినాదాలు చేస్తూ ర్యాలీలు నిర్వహించి తహసీల్దార్ కార్యాలయాల వద్ద వినతిపత్రాలు సమర్పించారు. తాడేపల్లిగూడెంలో ఏరియా ఆసుపత్రి వైద్యులు, ప్రైవేటు వైద్యులు సిబ్బందితో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కోల్‌కతాలో డాక్టర్‌ను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. డీసీహెచ్‌ఎస్ సూర్యనారాయణమూర్తి సిబ్బంది పాల్గొన్నారు.

వచ్చే నెల 20 నాటికి ఈ-పంట నమోదు చేయాలి

జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

నరసాపురంలో పొలాలు పరిశీలిస్తున్న జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి



నరసాపురం రూరల్, ఆగస్టు 17: ఖరీఫ్ సాగుకు సంబంధించి ఈ-పంట నమోదు వచ్చే నెల 20 నాటికి నూరుశాతం పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి అధికారుల్ని ఆదేశించారు. శనివారం లిఖితపూడి గ్రామంలో ఈ-క్రాప్ పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలందించారు. ఈ-క్రాప్ నమోదు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈక్రాప్ నమోదు వల్ల ప్రభుత్వ పథకాలు రైతులకు అందజేయడానికి వీలుంటుందన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి ఫొటోలు అప్‌లోడ్ చేయాలన్నారు.

సొసైటీల్లో కంప్యూటరైజేషన్ పూర్తి చేయాలి

పాలకొల్లు రూరల్, ఆగస్టు 17 : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ప్రభుత్వం ఇచ్చిన గడువులోపుగా ప్యాక్ కంప్యూటరైజేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. లంకలకోడేరు సొసైటీని ఆయన శనివారం ఆకస్మికం తనిఖీ చేశారు. ఈసందర్భంగా అకౌంట్స్, ఆడిట్ అభ్యంతరాలు తదితర అంశాలపై సమీక్షించి, సొసైటీలో జరుగుతున్న కంప్యూటరైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. జిల్లాలో 122 సొసైటీల్లో ఈప్రక్రియ గడువులోపుగా పూర్తి చేయాలని అన్నారు. సొసైటీల్లో రికార్డులు మాన్యువల్‌గా ఉండగా, మెంబర్ షిప్, లోన్, తదితర అంశాల రికార్డులను కంప్యూటరైజేషన్ చేయాలన్నారు.

సూర్యుని చుట్టూ సుందర వలయం

ద్వారకాతిరుమలలో కనువిందు చేసిన సన్ హాలో



ద్వారకాతిరుమల, ఆగస్టు 17: ద్వారకా తిరుమల వెంకన్న క్షేత్రంలో శనివారం ఉదయం సూర్యుడు చుట్టూ సప్తవర్ణ శోభితమైన సుందరవలయం ఏర్పడి కనువిందు చేసింది. 11 గంటల ప్రాంతంలో ఏర్పడి దాదాపు గంటన్నర సేపు ఈ ఇంద్రధనస్సు (సన్ హాలో) చూపరులకు ఆనందాన్ని పంచింది. ఇలా సూర్యుడి చుట్టూ వలయం ఏర్పడటాన్ని సన్ హాలో లేదా 22 డిగ్రీ హాలో అని పిలుస్తారు. వాతావరణంలో ఉండే లక్షలాది షడ్భుజాకారపు మంచు స్ఫటికాల గుండా కాంతి ప్రయాణించి నప్పుడు వక్రీభవన చెందడం వల్ల ఈ వలయాలు ఏర్పడతాయి.వాడుకలో ప్రజలు వరదగూడు అని పిలుచుకుంటారు. ఈ హాలోలు సూర్యునికి మాత్రమే కాదు. రాత్రివేళల్లో జాబిల్లికీ ఏర్పడుతుంటాయి.



రీజనల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సీఈవో సత్యనారాయణరాజు

భీమవరంలో కెనరా బ్యాంకు రీజనల్ కార్యాలయం

భీమవరం టౌన్, ఆగస్టు 17 : భీమవరం జువ్వలపాలెం రోడ్డులోని నూతనంగా నిర్మించిన కెనరా బ్యాంకు రీజనల్ కార్యాలయాన్ని శనివారం కెనరా బ్యాంకు సీఈవో, ఎండీ కె.సత్యనారాయణరాజు ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న తమ ఖాతాదారుల సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాజమండ్రిలో ఉండే రీజనల్ కార్యాలయాన్ని భీమవరానికి మార్చామని సీఈవో తెలిపారు. ఖాతాదారుల సొమ్ము భద్రత కోసం సైబర్ క్రైం బారిన పడకుండా కాపాడాలనే ఉద్దేశ్యంతో ప్రత్యేక సాఫ్ట్ వేర్‌ను రూపొందించామని, ఇప్పటికే 90 శాతం మంచి ఫలితాలు సాధించామని త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా విద్యవైద్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. గత ఏడాది ఈ కార్యక్రమాలకు రూ.60 కోట్లు వెచ్చించగా ఈసారి రూ.70 కోట్లు ఖర్చు చెయ్యాలని నిర్ణయించామన్నారు. భీమవరం రీజనల్ మేనేజర్ తోట రవిచంద్ర, విజయవాడ జీఎం రవి వర్మ, డీజీఎంలు విజయలక్ష్మి, మంజునాథ్, మేనేజర్లు జగదీష్, మరిడేశ్వరరావు, శ్రీనివాసన్, బిష్మయ సమాల్, రామానాయక్, టీడీపీ పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, తోట జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు మార్గనిర్దేశకాలు జారీ

భీమవరం ఎడ్యుకేషన్,ఆగస్టు 17 :గురుపూజోత్సవం పురస్కరించుకొని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల నామినేషన్ కోసం మార్గనిర్ధేశాలు, సూచలు జారీ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు. ఆ సూచనలను అనుసరించి ఆగస్టు 24 తేదీ లోపుగా సంబంధిత మండల విద్యాశాఖాధికారులకు నామినేషన్లు సమర్పించాలని తెలిపారు.

ఉత్తమ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్, ఆగస్టు 17 : ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాల్లో విద్య, విజ్ఞాన బోధనతో పాటు, కళ, క్రీడా రంగాల్లో విద్యార్థులను తీర్చి దిద్దుతున్న అధ్యాపకులు, ఉపాధ్యాయులను 'డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ, రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు-2024'లతో సత్కరించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు హైదరాబాద్‌కు చెందిన 'సర్వేజనా సుఖినోభవంతు' సంస్థ అధ్యక్షుడు డాక్టర్ నారాయణ మాస్టారు ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారికి ఈనెల 8న హైదరాబాద్‌లో పురస్కారాలను అందజేస్తారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాల్స్, హెచ్ఎంలు, టీచర్లు, అధ్యాపకులు తమ విద్యార్హతలు, బోధనానుభవం తదితర పూర్తి వివరాలు గల సర్టిఫికెట్లు, ఫోటోలు, పత్రికల క్లిప్పింగ్‌ల ఫోటోస్టాట్ కాపీలు, 4 పాస్‌పోర్టుసైజు ఫోటోలను దరఖాస్తుకు జతచేసి ఈ నెల 31లోగా 'సర్వేజనా సుఖినోభవంతు,డోర్ నెం : 1-20-164, గోకుల్‌నగర్, వెంకటాపురం, తిరుమలగిరి పోస్టు, సికింద్రాబాద్-15' చిరు నామాకు పంపాలని కోరారు.వివరాలకు 96523 47207 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

సెప్టెంబరు 14న జాతీయ లోక్ అదాలత్

ఏలూరు క్రైం, ఆగస్టు 17 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అన్ని కోర్టులలో సెప్టెంబర్ 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమకుమార్ తెలిపారు. ఏలూరు బార్ అసోసియేషన్ సభ్యులతో శనివారం సమావేశం నిర్వహించారు. పురుషోత్తమ కుమార్ మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో న్యాయవాదులు సంపూర్ణ సహకారం అందించాలన్నారు. రాజీయోగ్యమైన అన్ని క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, కుటుంబ వివాద కేసులు, పిటీషన్‌లను ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరిస్తామన్నారు. ఏలూరు బార్ అసోసి యేషన్ ప్రెసిడెంట్ కోనే సీతారామ్, 8వ అదనపు జిల్లా జడ్జి సునీల్‌కుమార్, పోక్సో స్పెషల్ కోర్టు జడ్జి ఉమాసునంద, బార్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు అబ్బినేని విజయ్‌కుమార్, జనరల్ సెక్రటరీ చింతమనేని రమేష్, కల్చరల్ సెక్రటరీ తిగిరిపల్లి సుబ్బారావు, బార్ సభ్యులు పాల్గొన్నారు.



జ్యోతికశ్రీని అభినందిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

యువతకు ఆదర్శం అథ్లెట్ జ్యోతికశ్రీ

తణుకు, ఆగస్టు 17: ఒలింపిక్స్‌లో రాష్ట్రం తరపున పాల్గొన్న అథ్లెట్ జ్యోతికశ్రీ భవిష్యత్‌లో మరింతగా రాణించాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శనివారం క్యాంపు కార్యాలయంలో జ్యోతికశ్రీని సత్కరించారు. సాధారణ కుటుంబంలో పుట్టి కష్టపడి అంచెలంచెలుగా ఎన్నో విజయాలను సాధించి ఒలింపిక్స్ స్థాయికి వెళ్లడం అభినందనీయమని, యువత జ్యోతికను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

ఊరూ వాడా బదిలీలు



- తాజాగా పచ్చ జెండా ఊపిన ప్రభుత్వం
- ఐదేళ్లు దాటితే ఉన్న చోటు నుంచి కదలాల్సిందే
- 15 శాఖలకే బదిలీల్లో స్థానం
- టీచర్లు, వైద్య సిబ్బందికి బదిలీలు నో
- 19 నుంచి 31 లోపే ఈ ప్రక్రియ ముగింపు
- ఈసారి కూడా పాత ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లానే ప్రాతిపదిక

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఎన్నాళ్లకెన్నాళ్లకు.. ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల సందడి సోమవారం నుంచి ఆరంభం కాబోతుంది. ప్రజా సంబంధపరమైన శాఖలకు మాత్రమే ఈసారి బదిలీలు వర్తింపజేశారు. ఉపాధ్యాయులు, వైద్య విభాగాల్లో పని చేస్తున్న వారిని ఈ ప్రక్రియ నుంచి ఈసారి మినహాయించారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో సిబ్బందిని కూడా ఈసారి పెద్ద ఎత్తున స్థాన చలనం కలిగించబోతున్నారు. విశేషమేమిటంటే పాత ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రాతిపదికనే ఈసారి కూడా బదిలీలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈప్రక్రియ ఈనెల 19 నుంచి ఆరంభమై 31 నాటితో ముగియనుంది. ఆ తదుపరి వెంటనే బదిలీలపై తిరిగి నిషేధం అమలులోకి వస్తుంది.

ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన మార్గదర్శక సూత్రాలను శనివారం ప్రభుత్వం విడుదల చేసింది. పెద్ద ఎత్తున బదిలీలకు అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది కాబట్టి ఇప్పుడు ఆయా నియోజకవర్గాల నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధులు సైతం తొలిసారి తమ పవర్ చూపించ డానికి కొంత వెసులుబాటు వచ్చింది. ఎవరైతే ఐదేళ్లపాటు ఒకే ప్రాంతంలో ఇప్పటివరకు కొనసాగి ఉంటారో వారందరినీ విధిగా బదిలీ చేసేందుకు ప్రభుత్వం నిర్దేశించింది. ఎలాగూ రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్లను అనుమతించారు. బదిలీల్లో పూర్తి పారదర్శక పాటిస్తామని ప్రకటించింది. వాస్తవానికి గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం పాలనా వ్యవహారాల్లో ఇష్టానుసారంగా వ్యవహరించింది. జిల్లాలను నేరుగానే విభజించింది. ఉమ్మడి జిల్లాలు చెదిరిపోయాయి. అప్పట్లో సర్దుబాటు పేరిట సీనియర్లందరినీ కొత్త జిల్లాలకు, జూనియర్లందరిని పాత ప్రాంతంలోనే కొనసాగించాలని నిర్ణయం తీసుకుని అమలు చేశారు. వైసీపీ ఎమ్మెల్యేలు పెద్ద ఎత్తున సిఫార్సులు చేశారు. అంతకంటే మించి తమకు నచ్చని వారిని సుదూర ప్రాంతాలకు పంపించారు. ఇలాంటి క్రమంలోనే జగన్ పాలనలో ఏర్పడిన గ్రామ సచివాలయాల్లోను పెద్దఎత్తున సిబ్బందిని నియమించారు. ఇప్పుడు వీరంతా దాదాపు ఐదేళ్లపాటు పదవీ కాలం పూర్తి చేసుకున్నట్టయ్యింది. వీరిలో అత్యధికులను ఎక్కడికక్కడ స్థాన చలనం చేయబోతున్నారు.

ఏఏ శాఖల్లో బదిలీలు ?

సాధారణంగా ప్రభుత్వపరంగా ఉద్యోగులందరినీ బదిలీ చేయకుండా కేవలం ప్రజాసంబంధ వ్యవహారాల్లో నిత్యం మునిగితేలే శాఖలనే బదిలీలకు కూటమి ప్రభుత్వం ఎంచుకుంది. ప్రత్యేకించి పోలీస్, రెవెన్యూ, కమర్షియల్ టాక్స్, పంచాయతీరాజ్, గ్రామ, వార్డు సచివాలయాలు, ఎక్సైజ్, రిజిస్ట్రేషన్‌లు, అన్ని ఇంజనీరింగ్ విభాగాల్లో కలిపి దాదాపు 15 శాఖల్లో మాత్రమే బదిలీలు చేయాలని నిర్ణయించారు. ప్రత్యేకించి పోలీస్ శాఖలో ఎస్ఐ, సీఐ, డీఎస్పీతో పాటు ఉన్నతాధికారులందరినీ ప్రభుత్వం పరిపాలనాపరమైన ఆమోదంతో ఎప్పటికప్పుడు బదిలీలు చేస్తూ వచ్చింది. అయితే పోలీస్‌శాఖలో కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లల్లో తమ అవసరాల రీత్యా జిల్లా ఎస్పీలకు తమ కష్టాలను విన్నవించుకుని బదిలీలు చేయించుకునేవారు. ఇప్పుడు తాజా ఉత్తర్వుల ప్రకారం వీరికి కూడా బదిలీలు వర్తిస్తాయి. ఇక రెవెన్యూకు సంబంధించి అత్యధికులు రాజకీయ పరమైన సిఫార్సులతోనే తమకు నచ్చిన ప్రాంతాల్లో ఎక్కువ కాలం కొనసాగుతూ వచ్చారు. ఇలాంటి వారిని ఈసారి బదిలీ చేస్తారు. ఇప్పటికే ఎంపీడీవో, తహసీల్దార్‌ల బదిలీ ప్రక్రియ దాదాపు పూర్తయినందున ఇక దిగువస్థాయి అధికారులు, సిబ్బందిపైనే బాణం ఎక్కుపెట్టారు. కమర్షియల్ టాక్స్ రిజిస్ట్రేషన్ వంటి శాఖలు ప్రభుత్వ ఆదాయ ఆర్జిత శాఖలు కావడంతో వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. రిజిస్ట్రార్‌లు, సబ్ రిజిస్ట్రార్‌లతో పాటు ఆ శాఖలో వివిధ కేటగిరీల్లో పని చేస్తున్న ఉద్యో గులను ఇప్పటికే బదిలీ చేసి చాలాకాలమైంది. కొందరైతే తమకు నచ్చిన స్థానాల్లో ఏళ్ల తరబడి ఒకే స్థానంలో పనిచేస్తూ వస్తూ ఎక్కడికక్కడ అవినీతికి పాల్పడ్డారు. ఇంకొందరు తమకునచ్చిన పార్టీలకు అనుకూలంగా వ్యవహరిస్తూ వచ్చారు. ఈ రెండు శాఖల్లోను పెద్ద ఎత్తున ప్రక్షాళన జరిగే అవకాశం లేకపోలేదు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎక్సైజ్ శాఖను దాదాపు నిర్వీర్యం చేశారు. ఉన్నత స్థాయి అధికారులకు కూడా పని లేకుండా చేశారు. త్వరలోనే ఎక్సైజ్ కొత్త పాలసీ తీసుకురానున్న నేపథ్యంలో అంతకు ముందే ఈశాఖను గాడిన పెట్టాలని నిర్ణయించి ఆ శాఖను బదిలీ జాబితాలోకి చేర్చారు.

గ్రామ,వార్డు సచివాలయాల్లోను కదలిక

గత ప్రభుత్వ మానస పుత్రిక గ్రామ వార్డు సచివాలయాలు. ప్రత్యక్షంగా ఎన్నికైన ఎంపీపీ, జడ్పీటీసీ, గ్రామ సర్పంచ్‌లను పక్కకు నెట్టేసి గ్రామ వార్డు సచివాలయాలను అమలులోకి తెచ్చింది. వీటిలో వివిధ విభాగాలకు చెందిన వారిని ఎంపిక చేశారు. ఆ క్రమంలోనే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని సచివాల యాల్లో దాదాపు 11 వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరిలో సగానికి సగం మందిని ఈసారి స్థాన చలనం చేసే అవకాశం ఉంది. ఈ శాఖల్లో పనిచేస్తూనే ఇంకోవైపు అప్పట్లో అధికార వైసీపీకి బాజా మోగించారు. ప్రభుత్వం అంటే మేమేనంటూ అలజడి చేశారు. ఇలాంటి వారందరినీ గడిచిన కొన్నినెలల క్రితం శాశ్వత ఉద్యోగులుగా నియమించారు. ఇప్పుడు వీరిలో అత్యధికులను బదిలీ చేయనుండడం సరికొత్త విశేషం.

ఎమ్మెల్యేలకు ఒక అవకాశం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు దాటిన తర్వాత తొలిసారిగా ఉద్యోగుల బదిలీలకు అనుకూలంగా ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. ఈ నేపథ్యంలో కొత్త ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు తారస్థాయిలో జరగాలని ఆకాంక్షిస్తున్నారు. ఇప్పటికే వైసీపీకి అంటకాగిన అధికారులు, సిబ్బంది అనేక మంది తమకళ్ళెదుటే ఉండడం వీరికి మింగుడు పడడంలేదు. నియోజక వర్గాల్లో తమకంటూ కొత్తటీమ్‌లను ఏర్పాటు చేసుకోవడానికి ఈ బదిలీ ప్రక్రియ కొత్త ఎమ్మెల్యేలకు వరంగా మారింది. సాధ్యమైనంత మేర ఇంజనీరింగ్ విభాగాలు, గ్రామ వార్డు సచివాలయాలు, రెవెన్యూ, రిజిస్ట్రేషన్, ఎక్సైజ్, పోలీస్ విభాగాలన్నింటిలోను అత్యధికులు రాజకీయ సిఫార్సులు కోరుకునేవారే. అందుకనే ఎమ్మెల్యేలు తమ అనుకూలురుకే ఎక్కువ ఛాన్స్ ఇవ్వబోతున్నారని ఇప్పటికే ప్రచారం. ఏది ఏమైనా సోమవారం నుంచి బదిలీల ప్రక్రియ ఆరంభమై ఈనెల 31వ తేదీన ముగియనుంది.ఈసారి కూడా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రాతిపదికనే బదిలీలు జరగబోతున్నాయి. ఈ ప్రక్రియకు ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారు.

దేశం గర్వించే రీతిలో విద్యార్థులు ఎదగాలి

ఐబీటీ అల్యుమ్ని కౌన్సిల్ ప్రెసిడెంట్ డాక్టర్ రవిశర్మ

ఏపీ నిట్‌లో ఘనంగా స్నాతకోత్సవం

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 17: దేశం గర్వించే రీతిలో విద్యార్థులు వినూత్న పరిశోధనలు , ఆవిష్కరణలు చేపట్టాలని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్, ఐబీటీ అల్యుమ్ని కౌన్సిల్ ప్రెసిడెంట్ డాక్టర్ రవిశర్మ అన్నారు. ఏపీ నిట్‌లో 6వ స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు.రవిశర్మ మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో ఎప్పటికప్పుడు కొత్తకొత్త సాంకేతికతలు ఆవిష్కృతం అవుతున్నాయని వాటిలో మెలుకువలు నేర్చుకుని పట్టు సాధించిన వారు అగ్రస్థానాల్లో నిలుస్తారన్నారు. విద్యార్థులు సరైన లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలన్నారు. ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరక్టర్ డాక్టర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ పరిశోధన, అభివృద్ధికి పెద్ద పీట వేసినప్పుడే ప్రగతి పథంలో పయనించేందుకు వీలుంటుందన్నారు. నిట్‌లో ప్రయోగశాల, పరిశోధన పరికరాల సేకరణ, మౌలిక సదుపాయాల నిమిత్తం కేంద్రం రూ.754 కోట్లు మంజూరు చేయనుందన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు కొత్త పాఠ్యాంశాలను అందుబాటులో తీసుకురానున్నామన్నారు. తొలుత 2020-24 విద్యాసంవత్సరంలో బీటెక్ పూర్తి చేసుకున్న 527 మంది విద్యార్థులకు, ఎంటెక్ పూర్తిచేసిన 15 మంది విద్యార్థులకు డిగ్రీలు, 25 మంది పరిశోధనా విద్యార్థులకు డాక్టరేట్ పట్టాలు అందజేశారు.

బంగారు పతకాల విజేతలు

బయో టెక్నాలజీలో రామిరెడ్డి వెంకటసాయిరెడ్డి 9.62 గ్రేడ్ పాయింట్లు, కెమికల్ ఇంజనీరింగ్‌లో మంకాల కార్తిక్ 9.44, సివిల్‌లో గుబ్బల హారిక 9.12, కంప్యూటర్ సైన్స్‌లో నలాడి వెంకట శశిభూషణ్ 9.83, ఈఈఈలో రెడ్డి వీర వెంకటసాయికృష్ణ అనిల్ 9.27, మెకానికల్‌లో మంత్రిప్రగడ సాయి అఖిల్ 9.56, మెటలార్జికల్ ఇంజనీరింగ్‌లో గంటా మోహిత్ యాదవ్ 8.83 లతో పాటు 2020-24 అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించిన వెంకట శశి భూషణ్‌కు ఇనిస్టిట్యూట్ తరపున బంగారు పతకాలను అందజేశారు. రిజిస్ట్రార్ డాక్టర్ డాక్టర్ దినేష్‌శంకర్‌రెడ్డి, డీన్‌లు డాక్టర్ ఆర్‌కే శాస్త్రి, డాక్టర్ టీ.కురుమయ్య, డాక్టర్ వీరేష్‌కుమార్, డాక్టర్ ఎస్.జయరాం, డాక్టర్ కార్తిక్ శేషాద్రి, అసోసియేట్ డీన్ డాక్టర్ సందీప్, సెనెట్ సభ్యులు, విభాగాధిపతులు, ఆచార్యులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న ముఖ్య అతిథి డాక్టర్ రవిశర్మ, ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ బీఎస్ మూర్తి

శాస్త్రవేత్తగా రాణించాలి : వెంకట శశిభూషణ్



నాన్న సుబ్బారావు ప్రైవేటు ఉద్యోగి. అమ్మ గృహిణి. మాది తణుకు.కంప్యూటర్ సైన్స్‌లో 9.83 గ్రేడు పాయింట్లు సాధించి ఇన్‌స్టిట్యూట్ టాపర్‌గా నిలవడం సంతోషంగా ఉంది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని పేపాల్ కంపెనీలో ఇంజనీరుగా పనిచేస్తున్నాను.శాస్త్రవేత్తగా రాణించాలనేది నా లక్ష్యం..

ఇంజనీర్‌గా స్థిరపడాలి : గుబ్బల హారిక



నాన్న శ్రీనివాసరావు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. అమ్మ కనకలత జూనియర్ ఇంజనీర్. మాది రామచంద్రపురం. సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో 9.12 గ్రేడు పాయింట్లు సాధించడం ఆనందంగా ఉంది. ఈఎస్‌సీ సర్వీసెస్‌లో ఇంజనీర్‌గా స్థిరపడాలనేది నా ఆశయం

నా కల సాకారమైంది : మంత్రిప్రగడ సాయి అఖిల్



నాన్న శ్రీనివాసరావు సీనియర్ ఎకౌంట్ మేనేజర్. అమ్మ సూర్యకుమారి గృహిణి. మాది విజయవాడ. మెకానికల్‌లో 9.56 పాయింట్లు సాధించాను. ప్రస్తుతం నేను క్యాట్ విజన్ కంపెనీలో ఇంజనీర్‌గా పనిచేస్తున్నాను. వార్షిక వేతనం రూ7.5 లక్షలు అందుకుంటున్నాను. నాకల సాకారమైనందుకు సంతృప్తిగా ఉంది.

నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి : టంకాల దీప్తి సాయి



నాన్న గుప్తా వ్యాపారవేత్త. అమ్మ జయలక్ష్మి గృహిణి. మాది శ్రీకాకుళం. ఈఈఈలో 9.09 గ్రేడు పాయింట్లు సాధించడం ఆనందంగా ఉంది. ప్రస్తుతం ఎల్అండ్‌టీ కంపెనీలో గ్యాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైనీగా చేస్తు న్నాను. వార్షిక వేతనం రూ 6.5 లక్షలు. నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటే ఏరంగంలోనైనా రాణించవచ్చు.

ఆఫీస్ బేరర్లకు వెసులుబాటుపై జర జాగ్రత్త !

ఉద్యోగుల సాధారణ బదిలీల మార్గదర్శకాలపై ఏపీఎన్జీవోల సంఘ నాయకుల వినతి

ఏలూరు అర్బన్, ఆగస్టు 17 : ఉద్యోగుల సాధారణ బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం మార్గదర్శకాలు, షెడ్యూలు విడుదల చేయడంపై ఏపీ ఎన్జీవోల సంఘం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాశాఖ అధ్యక్ష, కార్య దర్శులు సీహెచ్ శ్రీనివాస్, ఎస్.రామారావు హర్షం వ్యక్తం చేశారు. బదిలీలను జిల్లా అధికారులు పారదర్శకంగా నిర్వహించాలని, ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే చేయాలని కోరారు. బదిలీల నుంచి ఉద్యోగ సంఘాల ఆఫీస్ బేరర్లకు వున్న మినహాయింపు,వెసులుబాట్లపై ఉన్నతాధికారులు నిశిత పరిశీలన చేయాలని డిమాండ్ చేశారు. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో శాశ్వత గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల బైలాస్‌ను బట్టి రాష్ట్ర, జిల్లా, తాలూకా శాఖల ఆఫీస్ బేరర్లకు సంఘ నియమ నిబంధనల మేరకు కనిష్టంగా 6 సంవత్సరాలు, గరిష్టంగా 9 సంవత్సరాల పాటు మినహాయింపులుంటాయని, మూడు దఫాలు వినియోగించుకునేందుకు వీలుండే ఈ నిబంధనను అమలు చేసే టపుడు జిల్లా అధికారులు నిశిత పరిశీలన జరపాలని కోరారు. రికగ్నిషన్ ఆఫ్ సర్వీస్ అసోసియేషన్స్ (రోసా) నియమావళినే ప్రామాణికంగా తీసుకుని ఉద్యోగ సంఘాల ఆఫీస్ బేరర్లకు బదిలీల నుంచి మినహాయింపునివ్వాలని, ముఖ్యంగా కొన్ని సంఘాలు ఆఫీస్ బేరర్లకు జారీచేసే లేఖల వాస్తవికతపై సమగ్ర పరిశీలన జరిపిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో కొన్ని సంఘాలు జారీచేసిన ఆఫీస్ బేరర్ల లేఖలు, మినహాయింపులపై ప్రభుత్వం విచారణకు ఆదేశించిందని, ఇప్పటికైనా ఆ విచారణ నివేదికను బహిర్గతం చేసి తగిన చర్యలు చేపట్టాలని అభ్యర్థించారు. రాష్ట్రంలో ఏపీఎన్జీవోల సంఘానికి మూడంచెల కార్యవర్గాలు రాష్ట్ర,జిల్లా, తాలూకా స్థాయిల్లో ఉన్నాయని, ఆ మేరకు ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించిన ఎన్నికలు, ఎన్నికైన కార్యవర్గం ఆఫీస్ బేరర్ల జాబితా, ఏటా ఆడిట్ నివేదికలు పారదర్శకంగా ప్రభుత్వానికి, సంబంధిత ఉన్నతాధికారులకు సమర్పిస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 15 తాలూకాల శాఖలున్నాయని వివరించారు. రాత్రికి రాత్రి పుట్టగొడుగుల్లా పుట్టుకువచ్చే ఆఫీస్ బేరర్ల జాబితాలు, లేఖలను పరిగణలోకి తీసుకోరాదన్నారు.

తూర్పు గోదావరి జిల్లాలో ఇసుక స్టాక్ వివరాలు

భీమవరంటౌన్, ఆగస్టు 17 : తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ఉసులు మర్రులో 5,603 టన్నులు, పెండ్యాలలో 1,04,076 టన్నులు, నిడదవోలు మండలం పందలపర్రులో 37,602 టన్నులు, ఆయా స్టాక్ పాయింట్లు వద్ద టన్నుకు రూ.27 0 లకు ఉచిత ఇసుక లభిస్తుదని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కపీలేశ్వ రపురంలో 23,739 టన్నులు ఉందని టన్నుకి 265 రూపాయలు చెల్లించి పొందవచ్చు అని కలెక్టర్ తెలిపారు.

క్రైం కార్నర్

అప్పుల భయంతో వ్యాపారి ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఆగస్టు 17 : ఒకవైపు ఆరోగ్య సమస్య, మరోవైపు ఆర్థిక పరిస్థితులతో తల్లడిల్లుతూ జీవితంపై విరక్తి చెందిన చిరు వ్యాపారి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విజయనగరం జిల్లాకు చెందిన బంకురి నాగేశ్వరరావు (45) కొంతకాలం క్రితం ఏలూరు వచ్చి రాణి నగర్‌లో ఉంటున్నాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అల్యూ మినియం సామాన్ల వ్యాపారం చేస్తున్నాడు. వ్యాపారంలో నష్టాలు రావడంతో ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నాడు. మరోవైపు అతనికి బ్రెయిన్ క్యాన్సర్ ఉంది. వైద్యానికి అప్పులు చేయడం, కుమార్తెలకు వివాహాలు ఎలా చేయాలా అని దిగులుతో ఏలూరు తంగెళ్ళమూడి ప్రాంతం క్రైస్తవ సమాధుల తోటలోకి వెళ్ళి ఒక చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం ఉదయం ఏలూరు టూటౌన్ పోలీసులకు అందడంతో ఎస్ఐ మదీనా బాషా సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ భవన నిర్మాణ కార్మికుడి మృతి

ఏలూరు క్రైం, ఆగస్టు 17 : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఒక వ్యక్తి శనివారం మృతి చెందాడు. కృష్ణా జిల్లా నందివాడ మండలం వెన్ననపూడి గ్రామానికి చెందిన పిలిపే శిఖామణి (50) తాపీపనులు చేస్తూ ఉంటాడు. ఈనెల 16వ తేదీన లింగపాలెం మండలం వేములపల్లి గ్రామంలో పనికి వెళ్ళాడు. తిరిగి రాత్రి బయలుదేరి వెళ్తుండగా 10 గంటల సమయంలో ఏలూరు బైపాస్ వంగూరు వద్ద బ్రిడ్జిపై గుర్తు తెలియని వాహనం అతని మోటారు సైకిల్‌ను ఢీకొట్టింది. అతడిని 108లో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు.త్రిటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

టీ తాగుతూ కుప్పకూలి ఒకరి మృతి

ఏలూరు క్రైం,ఆగస్టు 17 :ఒక హోటల్ వద్ద టీ తాగుతున్న వ్యక్తి అకస్మాత్తుగా అక్కడే కూలబడి మృతి చెందాడు. ముసునూరు మండలం గోపవరానికి చెందిన గొర్రిముచ్చు శేషు (40)కు భార్య, కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం భార్య గర్భిణి.ఆమె ప్రసవం కోసం నూజివీడు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఆమెకు రక్తం అవసరం ఉందని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలోని బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లి తీసుకురావాలని అక్కడ వైద్యులు సూచించారు. శనివారం సాయంత్రం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి వచ్చాడు. ఆసుపత్రి గేటు పక్కనే ఉన్న హోటల్ వద్దకు వెళ్ళి టీ తాగుతూ నెమ్మదిగా కింద కూర్చుండిపోయాడు. పరిస్థితి గమనించిన వారు అక్కడి వారు ఆసుపత్రి సిబ్బందికి చెప్పడంతో అక్కడికి వచ్చి అత్యవసర విభాగానికి తీసుకు వెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని డాక్టర్ జ్యోతి నిర్ధారించారు. అతని వద్ద బ్లడ్ శాంపిల్ స్లిప్‌పై ఫోన్ నెంబర్ ఉండడంతో అతని బంధువులకు సమాచారం అందించి మృతదేహాన్ని అప్పగించారు. గుండెపోటు వల్లే మరణించాడని నిర్ధారణ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ మృతి

ద్వారకాతిరుమల, ఆగస్టు 17: లారీ అదుపుతప్పి పక్కనున్న కల్వర్టులోకి వెళ్లి తిరగబడటంతో అందులో ఇరుక్కున్న డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మండలంలోని ఎం.నాగులపల్లి శివారులో శనివారం జరిగింది. స్టేషన్ రైటర్ దుర్గారావు తెలిపిన వివరాల ప్రకారం దెందులూరు మండలం సోమవరప్పాడులోని బాలాజీ ఇండ్రస్ట్రీలో పని చేస్తున్న ఒడిశాకు చెందిన పటిడి కులేసిక (28) శనివారం సాయంత్రం కాంక్రీట్ మిక్సర్ లోడుతో మండలంలోని పి.కన్నాపురంలో ఉన్న కోకోకోలా ఫ్యాక్టరీకి వెళ్తున్నాడు. ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి లారీ అదుపుతప్పి రోడ్డు పక్కనున్న కల్వర్టులోకి దూసుకెళ్లింది. లారీ క్యాబిన్‌లో ఉన్న డ్రైవర్ అక్కడకక్కడే మృతి చెందాడు. బాలాజీ ఇండస్ట్రీస్ మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైటర్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో రెవెన్యూ ఉద్యోగి ఆత్మహత్య



కాళ్ళ ఆగస్టు 17 : ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగి ఉరి వేసుకుని మృతి చెందినట్టు కాళ్ళ ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఉండి తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న నందీశ్వరరావు (53) కాళ్ళ మండలం పెదఅమిరం పరిధిలోని మెహర్ బాబా స్కూల్ వెనుకవైపు చెట్టుకి ఉరి వేసుకుని చనిపోయినట్లు స్థానికులు ఇచ్చిన సమాచారం అందుకున్న కాళ్ళ పోలీస్ సిబ్బంది మృతదేహానికి కిందికి దింపి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పెనుగొండ మండలం ములపర్రు గ్రామానికి చెందిన నందీశ్వరరావు ఇటీవల వీఆర్వో నుంచి ప్రమోషన్ పొంది ఉండి తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు.మృతునికి భార్య, కుమారుడు,కుమార్తె ఉన్నారు. మృతుని భార్య రత్నకుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

వెంటాడిన దురదృష్టం

అమ్మకానికి పెట్టిన వాహనం దగ్ధం



జంగారెడ్డిగూడెం, ఆగస్టు 17: జంగా రెడ్డిగూడెం మండలంలోని పుట్ల గట్ల గూడెం సమీపంలోని గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డులో గడ్డి లోడుతో వెళ్తున్న టాటా ఏస్ వాహనం లోని వైర్లు షార్ట్ అయ్యి మంటలు చెలరేగి గడ్డితో పాటు వాహనం పూర్తిగా దగ్ధమైంది. పుట్లగట్లగూడెం గ్రామానికి జోనుబోయిన రమేష్ ఆరు నెలల క్రితం రూ.3 లక్షలతో కొనుగోలు చేసిన టాటా ఏస్ వాహనంలో టీ.నరసాపురం మండలం సింగరాయపాలెం గ్రామంలో ఎండు గడ్డి కొనుగోలు చేసి తీసుకువస్తుండగా పుట్లగట్ల గూడెం సమీ పానికి వచ్చేసరికి వైర్లు షార్ట్ అయ్యి మంటలు చెలరేగి గడ్డి అంటు కుంది. మంటలు అంటుకున్న విషయం తెలియక వాహనం నడుపు కుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వస్తున్న ద్విచక్ర వాహన దారుడు చెప్పడంతో రమేష్ వాహనాన్ని ఆపాడు. ఇంతలో మంటలు వాహనం ముందుకు ఉన్న రెండు డోర్లు వైపుకు వ్యాపించగా డోర్లు రెండూ స్టక్ అయ్యాయి. భయంతో డోర్‌ను కాలితో బలంగా తన్నడంతో డోరు తెరుచు కోవడంతో రమేష్ బయటకు వచ్చేయడంతో ప్రాణాపాయం తప్పింది. రమేష్ ఊపిరి పీల్చుకున్నాడు. జంగారెడ్డిగూడెం ఫైర్ స్టేషన్‌కు ఫోన్ చేయగా ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.అప్పటికే వాహనం పూర్తిగా దగ్ధమైంది. కిరాయిలు లేక కొద్దిరోజుల అమ్మివేశానని రూ.20 వేలు అడ్వాన్సు తీసుకున్నానని సోమవారం వాహనం డెలివరీ ఇవ్వాల్సి ఉండగా ఇలా జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

మాటలు కలిపి మద్యం తాగించి..

మద్యం మత్తులో మహిళపై అత్యాచారయత్నం

ఏలూరు క్రైం, ఆగస్టు 17 : పొట్టకూటి కోసం నగరానికి వచ్చిన ఒక జంట హోటల్‌లో పని చేస్తున్నారు. అద్దె ఇల్లు దొరక్కపోవడంతో ఒక గుడి ఆవరణలో పడుకున్నారు. అర్ధరాత్రి ముగ్గురు యువకులు గుడి వద్దకు వచ్చి మద్యం మత్తులో మహిళపై అత్యాచారయత్నం చేయగా అడ్డు వచ్చిన ఆమెతో ఉన్న వ్యక్తిని కూడా కొట్టారు. దీంతో ఆమె కేకలు వేయడడంతో అటుగా వెళ్తున్న ఒక యువకుడు రావడంతో ముగ్గురు పారిపోయారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు వన్‌టౌన్ పోలీసులు అత్యాచార కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. లింగపాలెం మండలం ఒక గ్రామానికి చెందిన మహిళ (35)కు భర్త మరణించడంతో పెదవేగి మండలం విజయరాయి గ్రామానికి చెందిన ఒక వ్యక్తితో సహజీవనం చేస్తోంది. పది రోజుల క్రితమే ఏలూరులోని ఒక హోటల్‌లో పనిచేసేందుకు వచ్చారు. అద్దె ఇంటికోసం వెతుకుతూ వన్‌టౌన్‌లోని ఒక గుడి ఆవరణలో రాత్రి తలదాచుకుంటున్నారు. ఈనెల 16 రాత్రి గుడి ఆవరణలో పడుకున్నారు. అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో ముగ్గురు యువకులు వచ్చి వారితో మాట కలిపారు. ఇల్లు అద్దెకు చూపిస్తామని తమ ఫోన్ నెంబర్ తీసుకోండి అంటూ నెంబర్ ఇచ్చారు. మద్యం తెచ్చామని తాగుతారా అంటూ వారికి మద్యం ఇచ్చారు. మద్యం మత్తులో ఆ ముగ్గురు మహిళపై అత్యాచార యత్నానికి ప్రయత్నించారు. ఆమె అడ్డగించడంతో ఆమెను కొట్టారు. అక్కడే ఉన్న ఆమె స్నేహితుడిని కొట్టారు. కేకలు వేయడంతో అటుగా వెళ్తున్న యువకుడు మోటారు సైకిల్ ఆపి కేకలు వేయడంతో ఆ ముగ్గురు యువకులు పారిపోయారు. ఈ సమాచారం పోలీసులకు చెప్పడంతో వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలిని ఆసుపత్రికి తరలించారు. ఆ ముగ్గురు యువ కులను పోలీసులు గుర్తించారు. వారు దొంగతనాల కేసుల్లో ఉన్న పాత నేరస్తులేనని గుర్తించారు. ఏలూరు టీచర్స్ కాలనీకి చెందిన నూతిపల్లి పవన్, లంబాడీ పేటకు చెందిన నారపాటి నాగేంద్రబాబు, గడ్డి విజయ్ కుమార్‌లుగా గుర్తించారు. ఆ ముగ్గురిపై అత్యాచారయత్నం, హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైరల్ జ్వరాలే.. ఆందోళన వద్దు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



డ్రెయినేజీలో మందు పిచికారీ పరిశీలిస్తున్న డీపీవో విక్టర్

ఆకివీడు రూరల్, ఆగస్టు 17 : పలు రకాల ప్రచారాలతో ఆందోళన చెందవద్దని.. వైరల్ జ్వరాల వల్లే కాళ్ల వాపు తదితర సమస్యలు వస్తున్నాయని వైద్య సిబ్బంది స్పష్టం చేశారు. దుంపగడప గ్రామంలో జ్వరాల విషయమై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'దుంపగడపలో అనారోగ్యం' ఎఫెక్ట్‌తో డీపీవో విక్టర్, వైద్య సిబ్బంది గ్రామంలో శనివారం పర్యటించారు. డ్రెయిన్లలో సిల్ట్ తీయించి, దోమల నివారణ మందులు పిచికారీ చేయించారు. గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరిశీలించి సూచనలు చేశారు. ప్రభుత్వ వైద్య సిబ్బంది మందుల కిట్‌లతో పాటు సిద్ధంగా ఉన్నారన్నారు. పెదకాపవరం పీహెచ్‌సీ సిబ్బంది ఐదు బ్యాచ్‌లుగా గ్రామంలో ఇంటింటికి పర్యటించి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ ముద్దే విశ్వేశ్వరరావు, ఈవోపీఆర్‌డీ వైద్యులు రాజశేఖర్, గోవర్దని, సీహెచ్‌వో ప్రసాద్, కార్యదర్శులు పాల్గొన్నారు.

మందుల వితరణ : గ్రామానికి చెందిన దాత పిన్నమరాజు శ్రీనివాసరాజు అనారోగ్యంతో బాధపడుతున్నవారికి ఇచ్చే రూ.20వేలు విలువ చేసే ఫ్ల్యూ ట్యాబ్లెట్లు సబ్ సెంటర్ వైద్య సిబ్బందికి అందజేశారు.

ఘనంగా బొలిశెట్టి పుట్టినరోజు వేడుకలు

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 17: ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పుట్టిన రోజు వేడుకలను పట్టణ ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు మారం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. తొలుత ఏలూరు రోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి క్షేత్రం వద్ద సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే బొలిశెట్టి నివాసం వద్దకు మేళతాళాలతో ఊరేగింపుగా తరలివెళ్లి వేదపండితులతో ఆశీర్వచనం అందజేశారు. అనంతరం 16వ వార్డు ఇన్‌చార్జి పాలూరి వెంకటేశ్వరరావు, పాలూరి బూరయ్య ఆధ్వర్యంలో 400 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మారం గిరీష్ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలో మారం యూత్ సభ్యులు పాలు, పండ్లు పంపిణీ చేశారు. 150 మంది వేద పండితులకు పంచెలు, ధోవతులు అందజేశారు. అనంతరం వాసవీ క్షేత్రం వద్ద అన్నసమారాధన చేశారు. పలు వార్డుల్లో కేక్ కట్ చేశారు. పేరూరి కాశియ్య, ఒబిలిశెట్టి నటరాజు, నున్న సుందరం, బోగవల్లి రమేష్, కొత్త శివకుమార్, భూర్లగడ్డ అంజనేయస్వామి, మండా ప్రకాష్, ప్రసాద్, ఏసు, బుద్దన సతీష్, మణికంఠ, పి.సాయి, గుత్తుల సురేష్, శివ పాల్గొన్నారు.

'జీవన విధానం మార్పుతో క్యాన్సర్ దూరం'



అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

తణుకు, ఆగస్టు 17: క్యాన్సర్ బారిన పడకుండా జీవన విధానాన్ని మార్చుకోవాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శనివారం బాలుర ఉన్నత పాఠశాల వద్ద కమ్యూనిటీ పారా మెడికల్స్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తణుకు మండల యూనిట్ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఇటీవల కాలంలో క్యాన్సర్ బారిన పడిన వారు 3, 4వ స్టేజీ వచ్చినా తెలుసుకోలేక అనేక మంది మరణిస్తుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. అనంతరం క్యాన్సర్ అవగాహన పోస్టర్ ఆవిష్కరించారు. ర్యాలీ నిర్వహించారు. టీడీపీ నాయకులు డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, కలగర వెంకట కృష్ణ, వావిలాల సరళాదేవి, మల్లిన రాధాకృష్ణ, తాతపూడి మారుతీరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి లోకేశ్ ఆర్థిక సాయం

అత్తిలి, ఆగస్టు 17 :లక్నో ట్రిపుల్ ఐటీలో ఎంఎస్‌సీ డేటా సైన్స్ చేసేందుకు అత్తిలి మండలం కె.సముద్రగట్టు గ్రామానికి చెందిన చేబ్రోలు బసవయ్య అనే విద్యార్థి ట్విట్టర్ ద్వారా మంత్రి నారా లోకేశ్‌ను ఆర్థిక సాయం కోసం అర్థించాడు. దీంతో బసవయ్యకు మొదటి సెమిస్టర్‌కు రూ.లక్షా 16 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆ మొత్తం చెక్కు రూపంలో తన క్యాంపు కార్యాలయంలో విద్యార్థికి అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సాయం కోరిన ప్రతి ఒక్కరికి మంత్రి లోకేశ్ అండగా నిలుస్తున్నారన్నారు.

మావుళ్లమ్మకు బంగారం అందజేత

భీమవరంటౌన్, ఆగస్టు 17 : శ్రీమావుళ్ళమ్మ అమ్మవారికి భీమవరానికి చెందిన పెన్మెత్స వెంకట రవీంద్రరాజు ఆదిలక్ష్మి దంపతులు పది గ్రాముల బంగారం విరాళంగా సమర్పించారు. ఆలయానికి వచ్చిన దాతలు అమ్మవారిని దర్శించుకోగా ఆలయ ప్రధానార్చకులు మద్దిరాల మల్లికార్జునశర్మ పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు చేసి ప్రసాదాన్ని అందించారు.



తాడేపల్లిగూడెంలోని నారాయణ పాఠశాలలో శనివారం విద్యార్థులకు రాజ్యాంగంపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ ఆన్సీ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించి హెడ్‌బాయ్, హెడ్ గర్ల్స్‌ను ఎన్నుకున్నారు

సంక్షిప్త సమాచారం..

- **ఆచంట, ఆగస్టు 17:** ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ శనివారం వ్యక్తిగత కారణాల వల్ల విదేశాలకు వెళ్లి మళ్లీ వచ్చే నెల 11వ తేదీన వస్తారని ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధి తెలిపారు.
- **నరసాపురం రూరల్ :** టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజును శనివారం వైవీలంకలోని ఆయన నివాసానికి వెళ్లి పొత్తూరి తండ్రి నర్సింహరాజు చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.
- **తణుకు :** కేరళలోని వరద బాధితులకు సీఐటీయూ జిల్లా కమిటీ నుంచి రూ. 45 వేలు శనివారం యూనియన్ అఖిలభారత అధ్యక్షురాలు డాక్టర్ హేమలతకు అందించారు.
- **అత్తిలి :** అత్తిలి ఛాంబర్ ఆఫ్ కామర్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు బేతు రామకృష్ణ గాంధీ మరణం వ్యాపార వర్గాలకు తీరని లోటని అత్తిలి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఆనాల ఆదినారాయణరావు అన్నారు.
- **నరసాపురం రూరల్ :** నరసాపురం మండలంలో ఐదు కేంద్రాల్లో ఆధార్‌సీడింగ్‌ను ఏర్పాటు చేశామని ఇన్‌చార్జి ఎంపీడీవో వీరభద్రరావు తెలిపారు. కొప్పర్రు, రుస్తుంబాద, తూర్పుతాళ్ళు, కొత్త నవరసపురం, చిట్టవరం గ్రామాల్లోని సచివాలయాల్లో సీడింగ్ చేస్తారన్నారు.
- **ఆకివీడురూరల్:** విద్యాప్రవేశ్ కార్యక్రమం విజయవంతంగా జరుగుతుందని అయిభీమవరంలో ఎంపీపీ పాఠశాలను సందర్శించి టీచర్ వెంకటలక్ష్మి రూపొందిస్తున్న టీఎల్ఎంలను పరిశీలించి ఏఎంవో రామకోటేశ్వరరావు అభినందించారు.
- **ఆచంట :** మైనర్లకు వివాహం జరిపిస్తే కఠిన చర్యలు తప్పవని శనివారం ఎంపీడీవో మకార్యాలయం వద్ద సీడీపీవో అధ్యక్షతన బాల్య వివాహాల నిషేధ చట్టం పై అవగాహన కార్యక్రమంలో పెనుమంట్ర సీడీపీవో కృష్ణకుమారి అన్నారు.
- **పెనుగొండ :** ప్రతీ పౌరుడు ప్రపంచ శాంతి ఐక్యతకు కట్టుబడి పని చేయాలని ప్లాస్టిక్ రహిత సమాజాన్ని ఏర్పరచుకోవాలని పెనుగొండలో నిర్వహించిన శాంతి ర్యాలీలో మానవత అధ్యక్షుడు డాక్టర్‌నల్లమిల్లి విజయరాజు అన్నారు.
- **ఉండి :** ఉండిలో రహదారుల పక్కన ఆక్రమణలను తొలగించే పనులలో భాగంగా రెండో రోజు శనివారం పంచాయతీ ఈవో గోపాలకృష్ణమూర్తి ఆధ్వర్యంలో కొలతలు, సర్వేలు నిర్వహించారు.
- **కాళ్ళ :** కాళ్ళకూరు వెంకన్న దేవస్థానంలో భక్తులచే స్వామి, అమ్మవార్లకు సమర్పించబడిన పంచెలు, చీరలకు శనివారం బహిరంగ వేలం జరపగా రూ.72,270 ఆదాయం వచ్చిందని ఈవో ఎం.అరుణ్‌కుమార్ తెలిపారు.







భీమవరం ప్రకాశంచౌక్‌లో నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు.. నరసాపురంలో నిరసన తెలుపుతున్న వైద్యులు.. తణుకులో ప్రభుత్వ వైద్యుల నిరసన ర్యాలీ

వైద్యుల నిరసన హోరు

జూనియర్ డాక్టర్ హత్యకు నిరసనగా ఆందోళనలు

కోల్‌కతాలో ఆర్జీ కర్ మెడికల్ కాలేజీలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారం ఘటనను నిరసిస్తూ శనివారం జిల్లావ్యాప్తంగా వైద్యులు, వైద్య సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టారు. ఐఎంఏ, పలు ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో మానవహారం, ర్యాలీలు మిన్నంటాయి. అఘాయిత్యానికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని నినాదాలు హోరెత్తించారు.

భీమవరం ఎడ్యుకేషన్/భీమవరం అర్బన్, ఆగస్టు 17 : భీమవరం పట్టణంలో ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్ వద్ద అత్యాచారాలను అరికట్టాలంటూ నినాదాలు హోరుతో పట్టణం దద్దరిల్లింది. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా గరల్స్ కన్వీనర్ చిన్నం శాంతి అధ్యక్షతన ప్రకాశంచౌక్‌లో మానవహారం నిర్వహించారు. ఐద్వా జిల్లా కార్యదర్శి పి. పూర్ణ, శ్రామిక మహిళా జిల్లా కార్యదర్శి డి.కల్యాణి, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పవన్, గణేష్ మాట్లాడుతూ జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం అత్యంత దారుణమని, సీబీఐ కేసు విచారణ వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు పవన్ తదితరులు పాల్గొన్నారు. వైద్యులపై దాడులకు కఠిన చట్టాలు అమలు చేయాలని రాష్ట్ర పీఎంపీ గౌరవ సలహాదారు నిడమర్తి జయసూర్య డిమాండ్ చేశారు.

- నరసాపురం టౌన్/మొగల్తూరు : నరసాపురంలో ఐఎంఏ ఆధ్వర్యంలో వైద్యులు భారీ నిరసన ప్రదర్శన చేశారు. శివాలయం సెంటర్ నుంచి అంబేడ్కర్ సెంటర్ మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు నల్లబ్యాడ్జీలు ధరించి ప్రదర్శన చేశారు. కొద్దిసేపు ధర్నా చేసి, అనంతరం ఆర్డీవో అంబరీష్‌కు వినతిపత్రం అందించారు. వైద్యులు బళ్ళ మురళీ, మాదంశెట్టి కోటేశ్వరరావు, ప్రకాష్, గణేష్, రాంబాబు, అందే సతీష్, నరేంద్ర, శ్రీనివాస్, సాయి, పద్మావతి, నర్సింహారావు పాల్గొన్నారు. ఏపీ మెడికల్ ఎంప్లాయిస్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో భారీ నిరసన ప్రదర్శన చేశారు. వైద్యుల ఆందోళనకు రెవెన్యూ తాలూక సంఘం అధ్యక్షులు చిరంజీవి, లక్ష్మీనారాయణ, కృపాదరం తదితరులు సంఘీభావం తెలిపారు. మొగల్తూరు మండలంలో డాక్టర్ల సమ్మెకు మండల పీఎంపీలు సంఘీబావం ప్రకటించారు.
- పాలకోడేరు/కాళ్ల/ఉండి/ఆకివీడు : పాలకోడేరు వైద్యులు, సిబ్బంది ఆధ్వర్యంలో పాలకోడేరు పీహెచ్‌సీ వైద్యుడు సీహెచ్.వి.రంగం నాయుడు అధ్యక్షతన ప్లకార్డులతో నిరసన ప్రదర్శన చేశారు. సీహెచ్‌వో సత్యనారాయణ, పీహెచ్ఎస్ కుమారి, సూపర్‌వైజర్ శంకర్, ఎంఎల్‌హెచ్‌పీలు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు. కాళ్ల మండలం కాళ్ళ ప్రభుత్వాసుపత్రి వైద్యులు సరాబు సునీల్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఉండి మండలం ఉండి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. పీహెచ్‌సీ సిబ్బంది, ఎంపీహెచ్‌వోలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ఆకివీడు పాత బస్టాండ్ వద్ద ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ కలిదిండి మహేష్‌వర్మ, యూపీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటపతిరాజు ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు, పలు రాజకీయ పార్టీ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీ నిర్వహించారు. వైద్యులు ఎంవీఎస్ రాజు, జంపన సుబ్బరాజు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు గొట్టుముక్కల వెంకటసత్యనారాయణరాజు, కూటమి నాయకులు, సీపీఎం, ఐద్వా శ్రేణులు ఉన్నారు.
- ఆచంట/పెనుగొండ : ఆచంట మండలంలోని ఆచంట కమ్యూనిటీ హెల్త్ సెంటర్, వేమవరం వల్లూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ప్లకార్డులతో నల్ల రిబ్బన్‌లు ధరించి నినాదాలు చేశారు. కచేరి సెంటర్‌లో ప్రదర్శన నిర్వహించి అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రదర్శన చేసి ఇన్‌చార్జి తహసీల్దార్ సుగణ సంధ్యకు వినతిపత్రం అందజేశారు. వైద్యులు శివరంజని, జితేంద్ర, రమ్య శృతి, ఉమాశంకర్, రామాంజనేయులు, పావని, యశ్వంత్ కుమార్ పాల్గొన్నారు. పెనుగొండ మండలంలో పెనుగొండ సీహెచ్‌సీ, సిద్ధాంతం పీహెచ్‌సీ, వడలి హెల్త్ కమ్యూనిటీ హెల్త్ ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు సిద్ధాంతంలో ఆందోళన చేశారు.
- పాలకొల్లు అర్బన్/యలమంచిలి : పాలకొల్లు గాంధీ బొమ్మల సెంటర్‌లో పట్టణంలోని వైద్యులు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఐఎంఏ వైద్యుడు కేఎస్‌పీఎస్ వర్మ, డాక్టర్ బాబ్జీ, డెంటల్ అసోసియేషన్ నుంచి ఎం.సంజయ్, సీహెచ్ మాధుర్, డాక్టర్ కళ్యాణ్, ఏరియా ఆసుపత్రి వైద్యులు, పీహెచ్‌సీ సిబ్బంది జన విజ్ఞాన వేదిక నాయకులు తదితరులు ఉన్నారు. యలమంచిలి మండలం కలగంపూడిలో జోగయ్య కళాశాల బి.ఫార్మసీ విద్యార్థులు శనివారం మానవహారంగా ఏర్పడి నిరసన ర్యాలీ చేపట్టారు. కళాశాల నుంచి హైవే మీదుగా చించినాడ ప్రధాన కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు.
- తణుకు/అత్తిలి : తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రి వైద్యులతో పాటు ప్రైవేటు వైద్యులు నిరసన తెలిపారు. జిల్లా ఆసుపత్రి వైద్యులు విధులు బహిష్కరించి ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ అశోక వర్మకు వినతిపత్రం అందజేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ, వైద్యులు ఎం.చక్రధరరావు, శారదా ప్రసూన, తదితరులు పాల్గొన్నారు. అత్తిలిలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి డిగ్రీ, జూనియర్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, పట్టణ ప్రముఖులు బస్టాండ్ సెంటర్లో మానవహారం నిర్మించి నిరసన తెలిపారు.
- గణపవరం : గణపవరం మండల పీఎంపీల అసోసియేషన్ శాఖ డిమాండ్ చేసింది. పీఎంపీల జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు, మండల అధ్యక్షుడు మండా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ మానవత్వం లేని ఈ హంతకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



ఆకివీడులో నిరసన తెలుపుతున్న వైద్యులు, రాజకీయ పార్టీల నాయకులు

'ఆసుపత్రులను సేఫ్ జోన్‌లుగా ప్రకటించాలి'



భీమవరంలో నిరసన తెలుపుతున్న వైద్యులు

భీమవరం క్రైం, ఆగస్టు 17 : డాక్టర్లపై హింసకు వ్యతిరేకంగా రూపొందించిన చట్టాన్ని కేంద్రం పకడ్బందీగా అమలు చేయాలని, ఆసుపత్రులను సేఫ్ జోన్‌లుగా ప్రకటించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భీమవరంశాఖ అధ్యక్షుడు డాక్టర్ జి బాలకృష్ణరాజు, కార్యదర్శి డాక్టర్ ఎస్.శంకర్‌కుమార్ వర్మ, రాష్ట్ర యాక్షన్ కమిటీ సభ్యులు డాక్టర్ ఎంవీ స్వరాజ్యలక్ష్మి అన్నారు. శనివారం భీమవరంలో డాక్టర్లు వైద్య సేవలను నిలిపి వేసి నిరసన తెలిపారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ వద్ద జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌వో భానునాయక్, జిల్లా వైద్యాధికారుల నాయకుడు డాక్టర్ సీహెచ్‌వీ రంగంనాయుడు ఆధ్వర్యంలో క్యాండిల్స్ ర్యాలీ నిర్వహించారు. ట్రెజరర్ డాక్టర్ బాలమురళీకృష్ణ, డాక్టర్ జి.సూర్యనారాయణరాజు, డాక్టర్ యిర్రింకి లక్ష్మీ, జాయింట్ సెక్రటరీ డాక్టర్ జి.సుభాష్, డాక్టర్ యిర్రింకి సూర్యనారాయణరావు, డాక్టర్ జి.గోపాలరాజు, డాక్టర్ యిర్రింకి నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

- పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఒకరోజు ముందుగా సేవల నిలిపివేత సమాచారం లేకపోవడంతో దూరప్రాంతాల నుంచి వచ్చిన రోగులు అవస్థలు పడ్డారు. అత్యవసర సేవలు సజావుగానే సాగడం వల్ల కొంత మేర ఇబ్బంది లేదు.

స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను భావితరాలకు తెలపాలి : ఎమ్మెల్యే అంజిబాబు



పేద మహిళలకు కుట్టుమిషన్లను అందిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరంటౌన్, ఆగస్టు 17 : ఆనాటి క్విట్ ఇండియా ఉద్యమంలో ఎందరో బ్రిటిష్ వారి తుపాకీ తూటాలకు బలైపోయారని, అటువంటి వారి స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను భావితరాల వారికి తెలపాలని ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు సూచించారు. శ్రీవిజ్ఞానవేదిక, జిల్లా సర్వోదయ మండలి సంయుక్త ఆధ్వర్యంలో క్విట్ ఇండియా స్థూపం వద్ద స్వాతంత్ర దినోత్సవ పక్షోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా భీమవరంలో క్విట్ ఇండియా ఉద్యమంలో అమరులైన వీరులకు నివాళులర్పించారు. భీమవరం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, వసుధ ఫౌండేషన్ సహకారంతో ఆరుగురు పేద మహిళలకు కుట్టు మిషన్లను అందించారు. అనంతరం క్విట్ ఇండియా ఉద్యమంలో అమరులైన కుటుంబ సభ్యులను సత్కరించి, పలు పాఠశాల, కళాశాలల్లో నిర్వహించిన పోటీలలో విజేతలకు, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఎస్డీవో అల్లూరి రవివర్మ, మానవతా సేవా సంస్థ అధ్యక్షుడు వర్మ, కార్యదర్శి వి.రాంబాబు, అల్లు శ్రీనివాస్, బుద్ధరాజు వెంకటపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

- అన్న క్యాంటీన్‌లకు దాతల అందిస్తున్న సహకారం అద్వితీయమని ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు అన్నారు. పట్టణంలోని ఏఎస్ఆర్ నగర్‌కు చెందిన చింతలపాటి విజయలక్ష్మి అన్న క్యాంటీన్‌కు రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. జనసేన పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్ ఉన్నారు.
- ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం మానవత్వమని తోటివారికి సహాయం చేసే సేవగుణం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. జనసేన పార్టీ మండల అధ్యక్షుడు మోక శ్రీనివాస్ ఆధ్వర్యంలో గల్ఫ్ జనసేన కమ్యూనిటీ గ్రూప్ సహకారంతో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో భీమవరం మెంటేవారి తోటకు చెందిన ఎస్కే. సుభాని, ఎండి సుఫీనా దంపతుల బిడ్డకు వైద్య నిమిత్తం రూ.10వేలు ఆర్థికసాయాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు.

యూటీఎఫ్, సీపీఎం నేత శ్రీరామ్మూర్తి మృతి



శ్రీరామ్మూర్తి (ఫైల్)

పాలకొల్లు అర్బన్/భీమవరం అర్బన్ ఆగస్టు 17 : యూటీఎఫ్ నాయుడు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వలవల శ్రీరామ్మూర్తి (90) శనివారం మరణించారు. వారం రోజులుగా అస్వస్థత వల్ల రాజమహేంద్రవరం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన మృతికి ఎమ్మెల్సీ ఇళ్ళ వెంకటేశ్వరరావు, సీపీఎం నాయకులు బి.బలరామ్, జేఎన్వీ గోపాలన్, మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్, జవ్వాది శ్రీనివాస్, వై.అజయ్‌కుమార్, అరట్లకట్ట ఉపాధ్యాయ సంఘాల నాయులు, రైతు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

రైతులంతా ఈ-క్రాప్ నమోదు చేయించాలి

పెంటపాడు/యలమంచిలి/ఆచంట/పోడూరు/పెనుమంట్ర, ఆగస్టు 17: రైతులంతా తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏడీఏ మురళీకృష్ణ, ఏవో పార్థసారథి అన్నారు. శనివారం మండలంలోని రైతులతో ఈ-క్రాప్ నమోదు చేయించారు. వీఏఏ విజయ, వీఆర్‌వో వెంకటేశ్వరరావు రైతులు పాల్గొన్నారు. యలమంచిలి మండలంలో ఏవో సీహెచ్.దేవి ఆధ్వర్యంలో, ఆచంట మండలంలో ఇన్‌చార్జి తహసీల్దార్ డి.సుగుణ సంధ్య ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో ఈ పంట నమోదు వేగవంతం చేయాలని సూచించారు. పోడూరు మండలం పండితవిల్లూరులో పోడూరు తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ సిబ్బంది ఈ-పంట నమోదుపై రైతులకు అవగాహన కల్పించారు. పెనుమంట్ర మండలం పాలమూరులో తహసీల్దార్ వై.రవికుమార్ ఈ-పంట నమోదును పరిశీలించారు.

అభిమానుల సేవా కార్యక్రమాలు భేష్ : నాయకర్



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బొమ్మిడి, కొత్తపల్లి

నరసాపురం రూరల్/భీమవరం టౌన్, ఆగస్టు 17: చిరంజీవి అభిమానులు చేస్తున్న రక్తదానం, మెడికల్ క్యాంపులు ఇతర సామాజిక సేవా కార్యక్రమాలు భేష్‌గా ఉన్నాయని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. చిరంజీవి జన్మ పుట్టిన రోజు ఈనెల 22వ తేదీని పురస్కరించుకుని శనివారం నరసాపురం మండలం చిట్టవరంలో అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను మాజీ మంత్రి కొత్తపల్లితో కలిసి కట్ చేశారు. అనంతరం మెరిట్ విద్యార్థులకు బహుమతులందించారు. కోటిపల్లి సురేష్, పోలిశెట్టి సత్తిబాబు, కోపల్లి శ్రీను, చెన్నంశెట్టి నాగు తదితరులు పాల్గొన్నారు.

- చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా అభిమాన సంఘం ఆధ్వర్యంలో పాలకొల్లు మండలంలోని పలు గ్రామాల్లో మొక్కలు నాటారు. అభిమాన సంఘం రాష్ట్ర కార్యదర్శి తులా రామలింగేశ్వరరావు విచ్చేసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. పెదమామిడి పల్లి గ్రామ అభిమాన సంఘం అధ్యక్షుడు చేబ్రోలు కృష్ణమోహన్ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో సుమారు వెయ్యి మొక్కలు నాటారు.
- సినీ నటుడు చిరంజీవి పుట్టినరోజు వేడుకలను సేవా కార్యక్రమాలతోనే నిర్వహిస్తున్నామని రాష్ట్ర చిరంజీవి యువత ఉపాధ్యక్షుడు ఉండపల్లి రమేష్ నాయుడు అన్నారు. భీమవరం పట్టణ మెగా ఫ్యాన్స్ ఆధ్వర్యంలో భీమవరం మెంటేవారితోట లోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. మెగా ఫ్యాన్స్ పట్టణ అధ్యక్షుడు చల్లా రాము, సుంకర చంద్, తోట శేషు, కొప్పర్తి కోటి, యడ్లపల్లి రాంబాబు, గొర్ల గోపి, యాతం స్వామి, కొమ్మన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలకు మహర్దశ : ఎమ్మెల్యే బొలిశెట్టి



శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే బొలిశెట్టి, బాబ్జి

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 17: జగన్ పాలనలో నిర్వీర్యమైన గ్రామాలకు కూటమి పాలనలో మహర్దశ రానుందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. జగన్నాథపురంలో రూ.40 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు శనివారం ఆయన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జితో కలిసి శంకుస్థాపన చేశారు.

యువతను క్రీడల్లో ప్రోత్సహించాలి

యువతను క్రీడల్లో ప్రోత్సహించాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. జగన్నాథపురంలో మాజీ సర్పంచ్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల సత్యనారాయణ సహకారంతో క్రీడాకారులకు జర్సీలు, వాలీబాల్, క్రికెట్ కిట్‌లను శనివారం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టితో పాటు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి జర్సీలు ఆవిష్కరించారు.

గ్రామ అభివృద్ధికి సహకరించండి



ఎమ్మెల్యే ధర్మరాజును సత్కరించిన అనంతకోటి రాజు

గణపవరం, ఆగస్టు 17: ప్రవాసాంధ్రుడు, వేగేశ్న ఫౌండేషన్ చైర్మన్ వేగేశ్న అనంతకోటి రాజు తమ స్వగ్రామాభివృద్ధికి మరింత సహకరించాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు కోరారు. శనివారం స్వగ్రామం గణపవరం వచ్చిన అనంతకోటిరాజును ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతకోటి రాజు మాట్లాడుతూ గణపవరంలోని ఇందిరమ్మ కాలనీ నిర్మాణానికి తన ఫౌండేషన్ తరపున రూ.50 లక్షలు ఇచ్చామన్నారు. గ్రామంలో తాగునీటి సౌకర్యానికి అదనంగా నూతన చెరువుల నిర్మాణానికి భూములు కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచామన్నారు. గ్రామాభివృద్ధికి ప్రభుత్వం తరపునుంచి కూడా సహకరించాలని ఎమ్మెల్యేను కోరారు. కాకర్ల విష్ణుశ్రీనివాసరావు, వేగేశ్న సుబ్బరాజు, కటారి రంగరాజు, నడింపల్లి సోమరాజు, సురేంద్రకుమార్‌రాజు, వేగేశ్న శ్రీనివాసరాజు, వేగేశ్న రాము తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లులో కాగడాల ప్రదర్శన



కాగడాల ప్రదర్శనలో సమితి సభ్యులు

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 17 : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా పట్టణంలో శనివారం రాత్రి ధర్మపరిరక్షణ సమితి ఆధ్వర్యంలో అధ్యక్షుడు గాదె వెంకన్న ఆధ్వర్యంలో భారీ కాగడాల ప్రదర్శన నిర్వహించారు. సభ్యులు తోట రాంబాబు, శిరం ఆనంద కృష్ణ, జక్కంపూడి కుమార్, కేవీ కృష్ణవర్మ, ధనాని ప్రకాష్, బి.కనక రాజు, బి.సత్యజిత్ కుమార్, తనికెళ్ళ శ్రీనివాస్, అంబటి రాజు, జీఎస్ఎన్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల అందజేత

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 17:స్థానిక బ్రాడీపేటలోని ఏవీఎస్ఎస్ఎం హైస్కూల్లో గత ఏడాది ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు కెనరా బ్యాంక్ ద్వారా అసిస్టెంట్ మేనేజర్ వంశీ స్కాలర్‌షిప్‌ల నగదు ప్రోత్సాహకాలను అందించారు. ఎల్ఎఫ్ఎల్‌హెచ్ఎం ఆర్.భవానీప్రసాద్ ప్రోత్సాహంతో శనివారం హైస్కూల్లో హెచ్ఎం ఎం.సురేష్ అధ్యక్షతన ప్రతిభ కనపరిచిన 8,9,10 తరగతులు చదువుతున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఒకొక్కరికి రూ. 5000 చొప్పున, 5, 6, 7 తరగతుల విద్యార్థులకు రూ.3000 చొప్పున అందించారు. ఉపాధ్యాయులు రాంజీ అంబేడ్కర్, దాసరి రాజ్‌కుమార్, గోపి కృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా నిమ్మల దరహాస్ పుట్టినరోజు వేడుకలు

పాలకొల్లు టౌన్, ఆగస్టు 17 : మంత్రి నిమ్మల రామానాయుడు కుమారుడు సాయి దరహాస్ జన్మదిన వేడుకలు పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రి, అన్న క్యాంటీన్ వద్ద కూటమి నాయకులు శనివారం నిర్వహించారు. కేక్ కట్‌చేసి అందరికీ పంచారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేసి భోజనాలు ఏర్పాటు చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గండేటి వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సబ్ జైలును సందర్శించిన న్యాయాధికారి

తణుకు, ఆగస్టు 17: తణుకు సబ్ జైల్‌ను తణుకు ఒకటో అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి పీవీ రంజిత్ కుమార్ శనివారం సందర్శించారు. ముద్దాయిలకు అందించే ఆహార, వసతి సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఎవరికైనా న్యాయవాది లేకపోతే కోర్టుద్వారా ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. న్యాయవాదులు చింతపల్లి నాగేశ్వరరావు, అజయ్‌కుమార్, తిర్రె సత్యనారాయణ, ధనుంజయ్, జైలు సూపరింటెండెంట్ జి. మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

కుముదవల్లిలో మళ్లీ ఫ్లెక్సీల వివాదం

పాలకోడేరు, ఆగస్టు 17: కుముదవల్లిలో ఫ్లెక్సీల వివాదం మరోసారి రచ్చకెక్కింది. కొన్నిరోజుల క్రితం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు భూపతిరాజు కృష్ణవర్మ ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు ఆ ఫ్లెక్సీలో వున్న భూపతిరాజు కృష్ణంవర్మ ఫొటోలను చించివేశారు. ఆ గొడవ సమసిందనుకున్న తరుణంలో గ్రామ సర్పంచ్, వైసీపీ నాయకుడు భూపతిరాజు వంశీకృష్ణ రాజుతో కూడిన ఫొటోతో ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు ఫ్లెక్సీలను గ్రామ కూడలిలో వైసీపీ నాయకులు ఏర్పాటు చేశారు. దీంతో ఆగ్రహించిన ఆ గ్రామ టీడీపీ నాయకుడు ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీకే కొమ్ముకాస్తారా ఇప్పటివరకు టీడీపీ గెలవదంటూ ప్రచారం చేసి ఫ్లెక్సీ ఏర్పాటుపై ఆగ్రహించారు. అనంతరం ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేసి ఫ్లెక్సీని తొలగించి పసుపునీళ్ళతో ఆ ప్రాంతాన్ని టీడీపీ నాయకులు శుద్ధి చేశారు. కార్యక్రమంలో సాగి మధువర్మ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం



పాలకొల్లులో షుగర్ వ్యాధి పరీక్ష శిబిరాన్ని ప్రారంభించిన సీఐ రజనీకుమార్

నరసాపురం రూరల్/ఆచంట/ఉండి/భీమవరం టౌన్/పాలకొల్లు రూరల్, ఆగస్టు 17: నరసాపురం మండలంలోని రుస్తుంబాద లెప్రసీ కాలనీలో శనివారం ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కాలనీలోని పేదలకు అన్నసమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నాయకర్ విచ్చేసి మాట్లాడారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంఘ అధ్యక్షుడు ఇజ్రాయిల్, కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఆచంట మండలంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉన్న గాంధీ విగ్రహం వద్ద జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. నియోజకవర్గ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గుర్రాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఉండి మండలం ఉండి మార్కెట్ యార్డులో ఏపీయూడబ్ల్యూజే, ఉండి ప్రెస్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ ఆవిర్భావ దినోత్సవం జిల్లా ఉపాధ్యక్షుడు డి.కృష్ణమోహన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భీమవరంలో ఏరియా ప్రెస్ క్లబ్, ఏపీయూడబ్ల్యూజే సంయుక్త ఆధ్వర్యంలో సీఐటీయూ భవనంలో ఘనంగా నిర్వహించారు. సీనియర్ పాత్రికేయులు జె. వెంకటేశ్వరరావును సన్మానించారు. ముఖ్య అతిథిగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు వీఎస్ సాయిబాబా హాజరయ్యారు. భీమవరం ఏరియా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కేవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. పాలకొల్లు గాంధీ బొమ్మల సెంటర్‌లో విజయ ల్యాబ్ డయాగ్నస్టిక్ సెంటర్ అధినేత కొమ్మల మురళీకృష్ణ పర్యవేక్షణలో శనివారం ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేసిన ఉచిత షుగర్ వ్యాధి నిర్ధారణ శిబిరాన్ని పట్టణ సీఐ కె. రజనీకుమార్ ప్రారంభించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు విన్నకోట వెంకటరమణ అధ్యక్షత వహించారు. ఐజేయూ జిల్లా కోశాధికారి ముత్యాల శ్రీనివాస్, ఎంఎస్‌వి సాంబశివరావు తదితరులు ఉన్నారు.